జ్వాల

# దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

శనివారం

11-07-2026

సంపుటి 1 సంచిక 228

పేజీలు : 04

వెల : 1/-

PRGI No : TGTEL/25/A4195




4లో

## అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఫాతిమా ఒవైసీ కాలేజీ

## చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో లేదన్న రాష్ట్ర ప్రభుత్వం!

### హైకోర్టు కీలక వ్యాఖ్యలు!



**దశ, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలోని జలవనరుల పరిరక్షణ, అక్రమ కట్టడాల కూల్చివేత అంశం మరోసారి చర్చనీయాంశమైంది. బండ్లగూడ లోని సల్కం చెరువు ఆక్రమణలకు సంబంధించి దాఖలైన ప్రజాప్రయోజన వాజ్యం విచారణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం హైకోర్టులో కీలక ప్రకటన చేసింది. ఫాతిమా ఒవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్ సల్కం చెరవు నోటిఫైడ్ ఎఫ్‌టీఎల్ పరిధిలో లేదని జాయింట సర్వేలో తేలినట్టు అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ కోర్టుకు తెలియజేశారు. అయితే, ఈ ప్రకటనతో వివాదం ముగిసిందని భావించలేం. ఎందుకంటే, ఒక వైపు ప్రభుత్వం క్లీన్ చిట్ ఇస్తుండగా, మరోవైపు హైకోర్టు ధర్మాసనం ప్రభుత్వ విభాగాల మధ్య ఉన్న సమన్వయ లోపాన్ని, నివేదికల్లోని వైరుధ్యాలను తీవ్రంగా తప్పుబట్టింది. ముఖ్యంగా

..మిగతా 4వ పేజీలో →



## కుదేలైన వానాకాలం సాగు!

### 16 జిల్లాల్లో వర్షాభావం..

### 65.95 లక్షల ఎకరాల లక్ష్యానికి..

### వరి సాగు కేవలం 4.22 లక్షల ఎకరాల్లోనే

**దశ, హైదరాబాద్:** తెలంగాణలో రుతుపవనాల నిరాశ రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వానాకాలం ప్రారంభమై 38 రోజులు గడిచినా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా పంటల సాగు తీవ్రంగా వెనుకబడింది. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదవగా, వరి సాగు లక్ష్యానికి చాలా దూరంగా నిలిచింది. 65.95 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయాలనే లక్ష్యానికి ఇప్పటివరకు కేవలం 4.22 లక్షల ఎకరాల్లో (6.40%) మాత్రమే నాట్లు పూర్తయ్యాయి. అన్ని రకాల పంటల సాగు కలిపి రాష్ట్రంలో ఇప్పటివరకు 41.79 శాతం విస్తీర్ణంలోనే సాగు జరిగినట్లు వ్యవసాయశాఖ ప్రభుత్వానికి సమర్పించిన తాజా నివేదిక వెల్లడించింది. జూలై నెలలో సగటున 47.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, కేవలం 39.9 మిల్లీమీటర్లే కురవడంతో 16 శాతం లోటు నమోదైంది. జూన్ నుంచి ఇప్పటి వరకు 177.9 మిల్లీమీటర్ల వర్షపాతం రావాల్సి ఉండగా, 154.9 మిల్లీమీటర్లే కురవడం వల్ల సీజన్ మొత్తం 13 శాతం వర్షాభావం నమోదైంది. వర్షాల కొరతతో రైతులు వరి నాట్లను వాయిదా వేస్తుండగా, పత్తి, మొక్కజొన్న, పప్పుధాన్యాల సాగు కూడా ఆశించిన స్థాయిలో జరగడం

..మిగతా 4వ పేజీలో →

రైతుల కళ్లలో ఆనందమే ప్రభుత్వానికి

## ఆశీర్వాదం

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**దశ, ఖమ్మం:** రాష్ట్రంలోని రైతుల కళ్లలో ఆనందం చూడటమే ప్రభుత్వ లక్ష్యమని, వ్యవసాయాన్ని దండగ కాకుండా పండుగగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో నిర్వహించిన రైతుల ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ, గత తొమ్మిది రోజుల్లో 73.30 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.9,000 కోట్ల రైతు భరోసా సాయం జమ చేసినట్లు తెలిపారు. సభలో చివరి విడతగా 1.44 లక్షల మంది రైతులకు రూ.1,009.15 కోట్ల సాయం విడుదల చేయడంతో పాటు భూమి హక్కుల కొత్త పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గత 30 నెలల్లో రైతు భరోసా, రుణమాఫీ, పంట బీమా, గిట్టుబాటు ధరలు, సన్న వడ్లకు అదనపు ప్రోత్సాహకం, ఉచిత విద్యుత్, పంట నష్టపరిహారం వంటి కార్యక్రమాల కోసం రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. రైతు భరోసా కింద మాత్రమే రూ.36,135 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని, ప్రతి నెలా సగటున రూ.5,500 కోట్లు రైతు సంక్షేమానికి వెచ్చిస్తున్నామని చెప్పారు. రాష్ట్రం భారీ అప్పుల్లో ఉన్నప్పటికీ గత ప్రభుత్వ సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే కొత్త పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతు భరోసా మొత్తాన్ని ఎకరానికి రూ.12 వేలకు పెంచామని, గత 30 నెలల్లో రూ.80 వేల కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేశామని

..మిగతా 4వ పేజీలో →




‘కల్యాణలక్ష్మి’, ‘షాదీ ముబారక్’ పథకాలపై

## హైకోర్టు ప్రశ్నలు..

### ప్రభుత్వానికి నోటీసులు

**దశ, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ‘కల్యాణలక్ష్మి’, ‘షాదీ ముబారక్’ పథకాల చట్టబద్ధతపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అసెంబ్లీ ఆమోదం లేకుండా కేవలం ప్రభుత్వ ఉత్తర్వుల (జీవోలు) ఆధారంగా భారీ మొత్తంలో ప్రజాధనాన్ని పంపిణీ చేయడంపై న్యాయస్థానం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ అంశంపై పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. న్యాయవాది విజయ్ గోపాల్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్

..మిగతా 4వ పేజీలో →

కోహెడలో రూ. 47 కోట్ల

## చేపల మార్కెట్‌కు శంకుస్థాపన

### మత్స్యకారులకు వరంగా మారనున్న ప్రాజెక్టు

### కోహెడలో మంత్రి శ్రీహరి కార్యక్రమంలో నిరసన.. మత్స్యకార సంఘం నాయకుల అరెస్టు

**దశ, రంగారెడ్డి ప్రతినిధి :** రంగారెడ్డి జిల్లా కోహెడలో రూ.47.03 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఎగుమతి ఆధారిత ఇంటిగ్రేటెడ్ హోల్‌సేల్ చేపల మార్కెట్‌కు రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు & క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మత్స్యకారులు ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని చెప్పారు. జాతీయ మత్స్య రైతుల దినోత్సవం సందర్భంగా మత్స్యకారులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి.. ముదిరాజ్‌ల సంక్షేమం కోసం ఎలాంటి అడ్డంకులు వచ్చినా వెనుకడుగు వేయబోనని, అవసరమైతే మంత్రి, ఎమ్మెల్యే పదవులనే కాకుండా ప్రాణత్యాగానికైనా సిద్ధమని అన్నారు. దేశంలో సముద్రతీర



ప్రాంతం కాకుండా అంతర్గత రాష్ట్రంలో ఏర్పాటు కానున్న తొలి ఆధునిక మంచినీటి చేపల ఎగుమతి కేంద్రంగా ఈ ప్రాజెక్టు నిలుస్తుందని మంత్రి తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులతో ఈ మార్కెట్

..మిగతా 4వ పేజీలో →



## కేటీఆర్, హరీశ్‌రావుపై కవిత సంచలన ఆరోపణలు

### బీఆర్ఎస్‌లోకి తిరిగి వెళ్లేది లేదని స్పష్టం

**దశ, హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో మరోసారి సంచలన వ్యాఖ్యలతో టీఆర్ఎస్ చీఫ్ కవిత వార్తల్లో నిలిచారు. బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీశ్‌రావుపై తీవ్ర ఆరోపణలు చేసిన ఆమె.. పార్టీ నిధులు, కాళేశ్వరం ప్రాజెక్టు, మీడియా వ్యవహారాలు, సోషల్ మీడియా ట్రోలింగ్‌పై ఘాటుగా స్పందించారు. గులాబీ పార్టీ ఖాతాలో ఉన్న రూ.1,400 కోట్ల నిధుల వెనుక క్విడ్ ప్రో కో అవినీతి ఉందని ఆరోపించిన కవిత, ఆ మొత్తాన్ని తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి చొప్పున పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. తాను మళ్లీ బీఆర్ఎస్‌లో చేరతానంటూ జరుగుతున్న ప్రచారాన్ని

..మిగతా 4వ పేజీలో →





## ఇంటింటికీ వెళ్లాల్సిన బీఎల్‌వోలు.. క్యాంపులకే పరిమితమా?

### అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు

4లో

## హరీశ్‌కు కాంగ్రెస్ తలుపులు తెరిచేనా?

### కాంగ్రెస్‌లోకి హరీశ్‌రావు వస్తానంటే చర్చిస్తాం: మహేశ్ గౌడ్

**దశ, హైదరాబాద్:** బీఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. మూడు నెలలు నీటిపారుదల మంత్రిగా అవకాశం ఇస్తే రాష్ట్రంలోని నీటి సమస్యను పరిష్కరిస్తానన్న హరీశ్‌రావు వ్యాఖ్యలను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఆయన నిజంగా కాంగ్రెస్ పార్టీలో చేరాలని కోరితే పార్టీలో చర్చిస్తామని అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. పొలిటికల్ అఫైర్స్ కమిటీలో చర్చించి హరీశ్‌రావును పార్టీలో చేర్చుకోవాలా లేదా అనే విషయంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పదేళ్లపాటు అధికారంలో ఉండి చేయని పనులను మూడు నెలల్లో చేస్తాననడం ఆశ్చర్యంగా ఉందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులు, అప్పులను సరిదిద్దే పనిలో కాంగ్రెస్ ప్రభుత్వం నిమగ్నమై ఉందని చెప్పారు.



### పార్టీలో విభేదాలపై టీపీసీసీ చీఫ్ క్లారిటీ

కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలపై స్పందించిన మహేశ్ కుమార్ గౌడ్.. భిన్నాభిప్రాయాలు ప్రతి పార్టీలో సహజమేనని అన్నారు. మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య నెలకొన్న వివాదాన్ని త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలూ పరిష్కారమవుతాయని చెప్పారు. ఇరు వర్గాల అభిప్రాయాలను విని పరిష్కారం చూపుతామని, పార్టీలో అందరూ సమానమేనని స్పష్టం

..మిగతా 4వ పేజీలో →

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ




**దశ, జఫర్‌గఢ్:** జఫర్‌గఢ్ మండలం రఘునాథపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అందజేశారు. సింగారపు శ్రీనుకు రూ.60 వేలు, దండు ఆగయ్యకు రూ.26 వేలు, కందుల రాజిరెడ్డికి రూ.1.25 లక్షల చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎడ్ల వెంకయ్య, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఆశ్రమంలో వ్యక్తి ఆత్మహత్య

**దశ, అబ్దుల్లాపూర్మెట్:** అబ్దుల్లాపూర్మెట్ పరిధిలోని అలేటి ఆశ్రమంలో శుక్రవారం ఉదయం ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, మృతుడు గడ్డం భాస్కర్ (34). తండ్రి జనార్ధన్. వృత్తిరీత్యా మేస్త్రీ. ప్రస్తుతం హయత్‌నగర్‌లోని శ్రీనివాస నగర్ కాలనీలో సోమయ్య ఇంట్లో నివాసం ఉంటుండగా, స్వస్థలం మహబూబాబాద్ జిల్లా, పర్వతగిరి గ్రామం. శుక్రవారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో అలేటి ఆశ్రమంలో ఉరివేసుకుని మృతిచెందినట్లు గుర్తించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## రామకృష్ణ మఠంలో 26న ప్రత్యేక ఆధ్యాత్మిక సదస్సు



**దశ, హైదరాబాద్:** నగరంలోని దోమల్‌గూడలో ఉన్న రామకృష్ణ మఠం వేదికగా ఈ నెల 26న 'ప్రత్యేక ఆధ్యాత్మిక సదస్సు' (Special Spiritual Retreat) అత్యంత వైభవంగా జరగనుంది. రామకృష్ణ మఠం అంతర్జాతీయ అధ్యక్షులు, పూజ్య సంఘ గురువులు స్వామి గౌతమానందాజీ మహరాజ్ దివ్య సమక్షంలో ఈ కార్యక్రమం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు వివేకానంద ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. ఈ సదస్సులో ప్రముఖ హిందుస్తానీ సంగీత విద్వాంసులు పండిట్ దత్తాత్రేయ వేలాంకర్ ఆలపించే భక్తిరంజక భజనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. అలాగే పూజ్య ప్రెసిడెంట్ మహరాజ్ చేతుల మీదుగా నూతన పుస్తక ఆవిష్కరణతో పాటు సరికొత్త 'ఏఐ (AI) వీడియో' విడుదల కానుంది. ఈ కార్యక్రమానికి రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 100/గా నిర్ణయించారు. ఆసక్తి గల భక్తులు మఠం కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని, భక్తులందరికీ ఇదే ఆత్మీయ ఆహ్వానమని మఠం అధ్యక్షులు స్వామి బోధమయానంద ఒక ప్రకటనలో తెలిపారు.

## కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న కేంద్రం

***మేకల శ్రీనివాసరావు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి***

**దశ, హుజూర్‌నగర్ :** స్వతంత్రానికి పూర్వమే సాధించుకున్న కార్మిక హక్కులను హరించే ప్రయత్నం లో భాగమే నరేంద్ర మోడీ విధానాలున్నాయని, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం హుజూర్ నగర్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనాభాలో సగానికి పైగా కార్మిక వర్గం ఉన్నదని,ఆ కార్మిక వర్గానికి చేయాల్సింది చేయకపోగా ఉన్న హక్కులను తీసివేస్తూ కార్పోరేట్ పెట్టుబడిదారీ శక్తులకు మోడీ కొమ్ముకాస్తున్నాడని, అన్నారు. రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా కార్మిక వర్గం కదం తొక్కుతుందని,ఆ గాలిలో నరేంద్ర మోడీ కొట్టుకొని పోవడం ఖాయం అని ఆయన అన్నారు.దేశంలో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, అప్రెంటిస్ థర్డ్ పార్టీ ట్రైనీలుగా పనిచేస్తున్న కార్మికులను తక్షణమే పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్,ఇందిరాల వెంకటేశ్వర్లు, జక్కుల రమేష్, మారుడి శ్రీనివాస్ రెడ్డి,జెట్టి ప్రసాద్, దగ్గుపాటి సత్యానందం, ఎస్.కె రన్మియా, ఎడవల్లి వెంకటేశ్వర్లు,బెల్లంకొండ రామ్మూర్తి, ముదుసు పాపారావు పాల్గొన్నారు.

# విశ్వహిందూ పరిషత్ వృక్షార్పణ కార్యక్రమం




**దశ, భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ ప్రఖండంలోని పాత పాల్వంచలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా వృక్షార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన మొక్కల నాటే కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, అడవుల తగ్గుదల వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా సమాజం పట్ల ప్రతి పౌరుడి బాధ్యత అని నాయకులు పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే విస్తృతంగా వృక్షార్పణ కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా పాత పాల్వంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో, అలాగే చింతల చెరువు కట్ట సమీపంలోని ఆత్మలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలను నాటారు. అనంతరం మొక్కలను సంరక్షిస్తామని కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ఖమ్మం విభాగ్ సంఘటన కార్యదర్శి గడిదేశి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు చిలుకూరి నాగేశ్వరరావు, జిల్లా సంఘటన కార్యదర్శి గంగాధరి సీత, జిల్లా బజరంగ్ దళ్ సంయోజక్ శ్రీరామోజు మధుసూదన చారి, దుర్గావాహిని జిల్లా సంయోజిక గంగాధరి ఇందుమతి, బజరంగ్ దళ్ పాల్వంచ ప్రఖండ విద్యార్థి ప్రముఖ్ గడిదేశి సాయి భరత్, అల్లి గౌతమ్, గడిదేశి ఆదిత్యతో పాటు విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి, దానిని చెట్టుగా పెంచాలని నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. వృక్షాలు ప్రకృతి సమతుల్యతను కాపాడటంతో పాటు స్వచ్ఛమైన గాలి, వర్షపాతం, జీవవైవిధ్య పరిరక్షణకు ఎంతో దోహదపడతాయని వారు పేర్కొన్నారు.



## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి.. కేసు నమోదు

**దశ, అబ్దుల్లాపూర్‌మెట్, జులై 10:** అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. జులై 8న అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్‌కు చెందిన అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి. యుగంధర్ ఫిర్యాదు చేశారు. జులై 7 తెల్లవారుజామున సుమారు 3.50 గంటల సమయంలో రామోజీ ఫిల్మ్ సిటీ నుంచి ఔటర్ రింగ్ రోడ్ వరకు ఎన్‌హెచ్ 65పై పోలీసు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, గండి మైసమ్మ ఆలయానికి ఎదురుగా హైదరాబాద్ వైపు రోడ్డుపై 50 నుంచి 55 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి తీవ్ర గాయాలతో పడిఉండటం గుర్తించారు. ఆ వ్యక్తికి ముక్కు, ఎడమ చేయి, ఎడమ కాలికి తీవ్ర గాయాలు ఉండగా, గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి అక్కడి నుంచి పరారైనట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. వెంటనే 108 అంబులెన్స్ ద్వారా బాధితుడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ జులై 7 రాత్రి 10.14 గంటలకు బాధితుడు మృతి చెందాడు. ఈ ఘటనపై అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనం, డ్రైవర్‌ను గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టారు.

## ఓటర్ల వద్దకు వెళ్లని బీఎల్‌వోలు



- ***ఎస్ఐఆర్ సవరణపై ప్రజల ఆందోళన***
- ***గడువు దగ్గరపడుతున్నా ఇంటింటి సర్వే ఎక్కడ***

**దశ, బూర్గంపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజల్లో సందేహాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించి, అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ, మండలంలోని కొన్ని ప్రాంతాల్లో అలాంటి సర్వే జరుగుతున్నట్లు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఓటర్లను నేరుగా కలిసి వివరాలు సేకరించాల్సిన బీఎల్‌వోలు కొందరు క్షేత్రస్థాయికి వెళ్లకుండా కార్యాలయాలకే పరిమితమవుతున్నారని ప్రజలు చెబుతున్నారు. దీంతో తమ వివరాలు నమోదు అయ్యాయా లేదా, ఏవైనా మార్పులు అవసరమైతే ఎలా చేయించుకోవాలనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు రోజురోజుకూ దగ్గరపడుతున్న నేపథ్యంలో ఇంకా అనేక ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో ఇంటింటి సర్వే జరగలేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను నమోదు చేయాలని అధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినప్పటికీ, కొన్ని బూత్‌ల పరిధిలో ఆ ప్రక్రియ ఆశించిన స్థాయిలో అమలు కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితిపై సంబంధిత ఎన్నికల అధికారులు దృష్టి సారించి, ప్రతి బీఎల్‌వో క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ఎలాంటి అర్హత కలిగిన ఓటరు పేరు జాబితాలో మిస్ కాకుండా, పారదర్శకంగా సవరణ ప్రక్రియ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## బుస్సు పుల్లారెడ్డిని పరామర్శించిన మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



**దశ, రంగారెడ్డి:** ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై గుండెకు శస్త్రచికిత్స చేయించుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ సింగిల్ విండో చైర్మన్ బుస్సు పుల్లారెడ్డిని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్యుల సూచనలు పాటిస్తూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బియ్యని జ్ఞానేశ్వర్, సర్పంచ్ బత్తుల శ్వేతతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## విద్యా హక్కుల కోసం రోడ్డెక్కిన విద్యార్థి సంఘాలు

- ***విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలి***
- ***ప్రభుత్వ పాఠశాలల విలీన నిర్ణయం రద్దు చేయాలి***
- ***ప్రైవేటు విద్యాసంస్థల ఫీజులకు నియంత్రణ చట్టం తీసుకురావాలి***
- ***ఫీజురియంబస్‌మెంట్ చెల్లించాలని డిమాండ్***

**దశ, భద్రాచలం:** విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు ఇచ్చిన బంద్ పిలుపు శుక్రవారం భద్రాచలంలో విజయవంతమైంది. ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో చేపట్టిన బంద్‌కు విద్యార్థులు పెద్ద ఎత్తున మద్దతు తెలుపుతూ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మునిగేలా శివ ప్రశాంత్, భారత విద్యార్థి సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వం 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేల సముదాయ ప్రభుత్వ పాఠశాలలుగా కుదించే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యకు తగిన నిధులు కేటాయించి విద్యాసంస్థలను బలోపేతం చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు.

ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టేందుకు కఠిన నియంత్రణ చట్టం తీసుకురావాలని, పాఠ్యపుస్తకాలు, దుస్తుల బలవంతపు అమ్మకాలను నిలిపివేయాలని, పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు తిరిగి చెల్లింపు బకాయిలను వెంటనే విడుదల చేయాలని, మధ్యాహ్న భోజన పథకానికి తగిన నిధులు కేటాయించి ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, విద్యాహక్కును పరిరక్షించే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం విచారకరమని విమర్శించారు. విద్యారంగ సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# మోడల్ కాలనీలో 2,160 ఇండ్ల నిర్మాణం

- ***పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక***
- ***తెలంగాణ పబ్లిక్ స్కూల్ కు శంకుస్థాపన: మంత్రి ఉత్తమ్***



**దశ, హుజూర్‌నగర్ :** రాష్ట్ర చరిత్రలో ఒకే చోట 2,160 ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి పేదలకు అందిస్తున్నామని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం హుజూర్ నగర్ లోని రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాలలో రూ.125 కోట్లతో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల ప్లాట్ల మోడల్ కాలనీలో రూ.20 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్, అంగన్ వాడి భవనం,కమ్యూనిటీ హాల్,సిసి రోడ్లు, డ్రైన్స్,వీధి లైట్లు, పిల్లల ఆట స్థలం, షాపింగ్ కాంప్లెక్స్, ఆర్చ్ లకు శంఖుస్థాపనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ హుజూర్ నగర్ నియోజకవర్గంలో నిరుపేదలు,వ్యవసాయ కూలీలు, రైస్ మిల్లులో పనిచేసే వారికి ఆశ్రయం కల్పించాలన్న లక్ష్యంతో 110 ఎకరాల దేవాలయ భూములను మార్కెట్ రేటుకి కొనుగోలు చేసి పనులు ప్రారంభించడం జరిగిందని కానీ రాష్ట్ర విభజన తర్వాత ఆనాటి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేసినదని, తిరిగి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 14 సంవత్సరాల తన పట్టుదల,కృషి, ఆకాంక్షలతో తిరిగి పనులను ప్రారంభించి ప్రాజెక్టును పూర్తిచేసి పేద ప్రజలకు అందించడం నా చిరకాల స్వప్నం అని,దీనిని నా అదృష్టంగా భావిస్తున్నానని, రూ.75 కోట్లతో అంతర్గత రోడ్లు, ఎలక్ట్రిసిటీ,త్రాగునీరు,డ్రైనేజీ వ్యవస్థ కొరకు ప్రభుత్వం నుండి మంజూరు చేయించి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించినట్లు వెల్లడించారు.

ఇందులో 10 కోట్లతో 32 వేల స్కేర్ ఫీట్ సైజ్ లో తెలంగాణ మోడల్ పబ్లిక్ బోర్డింగ్ స్కూల్ నిర్మాణం చేసుకోవడం జరుగుతుందని , ఇందులో 2,500 మంది హౌసింగ్ కాలనీ, హుజూర్నగర్ లోకల్ పేద విద్యార్థులు చదువుకోడానికి వీలుంటుందని పూర్తిగా ఇంగ్లీష్ మీడియం లోనే విద్యాభ్యాసం ఉంటుందని, మిగతా 10 కోట్లతో అంగన్ వాడి భవనం, కమ్యూనిటీ హాల్, సిసి రోడ్లు, డ్రైన్స్ , వీధి లైట్లు, పిల్లల ఆట స్థలం, షాపింగ్ కాంప్లెక్స్, ఆర్చ్ నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని మంత్రి అన్నారు. కాలనీలో ఇంకా గ్రీనరీ పెంచాలని అలాగే జిల్లాలోని హౌసింగ్ సిబ్బందితో ప్రతి ప్లాటు క్షుణ్ణంగా చెక్ చేసి,అన్ని పనులు పూర్తి అయినవో, ఇంకా ఏమైనా పెండింగ్లో ఉన్నాయో నివేదిక అందించాలని కలెక్టర్ కు సూచించారు. అలాగే ఒకే ఇంట్లో 18 సంవత్సరాలు నిండిన ఇద్దరు పిల్లలు ఉంటే వారికి అదనంగా ఇంకో ప్లాటు మంజూరు చేయాలని, బాత్రూం, టాయిలెట్స్ చిన్నవిగా ఉన్నందువలన ఎవరైనా అతిథులు వస్తే ఇబ్బందికరంగా ఉంటుంది కావున కాలనీలో బయట వైపు అదనంగా టాయిలెట్స్,బాత్రూమ్స్ మున్సిపాలిటీ వారితో నిర్మించి, వారికే మెయింటినెన్స్ అప్పగించాలని, ప్రతి హౌసింగ్ బ్లాక్ కి మూడు రంగులు స్పష్టంగా కనబడే విధంగా మరొక కోటింగ్ వేయించాలని, ఇందిరమ్మ హౌసింగ్ కాలనీలోకి ప్రవేశించటానికి ప్రస్తుతం ఒకే రోడ్డు ఉన్నదని అదనముగా మరొక రోడ్డును కూడ వేయించడం జరుగుతుందని, మోడల్ హౌసింగ్ కాలనీ అంటే మోడల్ గా క్వాలిటీ బ్రహ్మాండంగా ఉండాలని, అర్హులకు మాత్రమే ఇండ్లు మంజూరు చేయాలని, అర్హత లేని వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఇండ్లు మంజూరు చేయకూడదని ఎంపిక విషయంలో ఎలాంటి అవినీతికి, అవకతవకలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు.

ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించిన తర్వాత జనాభాను బట్టి వార్డులుగా విభజించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్,పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు,మున్సిపల్ చైర్ పర్సన్ దొంతగాని శ్రీనివాస్,మార్కెట్ కమిటీ చైర్మన్ రాధికా,ఆర్డీవో శ్రీనివాసులు, తాసిల్దార్ కవిత, డీఎస్ఓ మోహన్ బాబు,హార్టికల్చర్ అధికారి నాగయ్య, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య పాల్గొన్నారు.

జ్వాల
దశ
నిజం.. నిర్భయంగా..
శనివారం
11-07-2026
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
ఖమ్మం
వైరా | సత్తుపల్లి | పాడేరు | మధిర
భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం | ఇల్లందు | పినపాక |
భద్రాచలం | అశ్వరావుపేట
WWW.DASHANEWS.COM

# విద్యారంగ సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా బంద్ విజయవంతం

- భద్రాచలంలో పి డి ఎస్ యూ, ఎస్ ఫ్ ఐ ఆధ్వర్యంలో ఆందోళన
- విద్యాశాఖ మంత్రి నియామకం, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్



**దశ, భద్రాచలం:** విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పి డి ఎస్ యూ, ఎస్ ఫ్ ఐ విద్యార్థి సంఘాల పిలుపు మేరకు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన విద్యాసంస్థల బంద్ భద్రాచలంలో విజయవంతంగా జరిగింది. పట్టణంలో విద్యార్థులు ఆందోళనలు నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా పిడిఎస్ యూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మునిగేలా శివ ప్రశాంత్, SFI జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేల క్లస్టర్ పాఠశాలలుగా కుదించే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యకు తగిన బడ్జెట్ కేటాయించి విద్యాసంస్థలను బలోపేతం చేయడంతో పాటు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టేందుకు కఠిన నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల బలవంతపు అమ్మకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.7 వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. అలాగే రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని ఇప్పటికైనా నియమించాలని, మధ్యాహ్న భోజన పథకానికి తగిన నిధులు కేటాయించాలని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, అల్పాహారం అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాస్వామ్య, లౌకిక, శాస్త్రీయ విద్యను పరిరక్షించేందుకు ప్రతి విద్యార్థి బంద్‌లో పాల్గొని విజయవంతం చేశారని వారు పేర్కొన్నారు. విద్యారంగ సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి డి ఎ స్ యూ నాయకులు దండుగుల రామ్ చరణ్, తోట నరేందర్, అనంత రాములు, కారం జయరాజు,పాయం చరణ్,ఎస్ ఎఫ్ ఐ నాయకులు అభిషేక్,ఆంబోజు,అజయ్ కుమార్,భరత్,ఉదయ్ కిరణ్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అశ్వాపురంలో బీఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయం ప్రారంభం

- ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు



**అశ్వాపురం, జూలై 10:** భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే లక్ష్యంతో అశ్వాపురంలో ఏర్పాటు చేసిన నూతన పార్టీ కార్యాలయాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి, ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో రేగా కాంతారావు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత పటిష్ఠం చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి ప్రజాదరణ రోజురోజుకూ పెరుగుతోందని, రాబోయే రోజుల్లో పార్టీ మరింత బలోపేతమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అశ్వాపురంలో బీఆర్ఎస్ కార్యకలాపాలకు నూతన కార్యాలయం కేంద్రంగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు.

# మణుగూరులో కల్వకుంట్ల కవిత పర్యటన

- సింగరేణి కార్మికులకు అండగా ఉంటామని హామీ



**దశ, మణుగూరు:** మణుగూరులో పర్యటించిన తెలంగాణ రక్షణ సమితి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సింగరేణి కార్మికుల సమస్యలపై స్పందిస్తూ వారికి పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఓసీ2 గని ప్రైవేటీకరణ ప్రతిపాదనను తెలంగాణ రక్షణ సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. సింగరేణి కార్మికుల హక్కులు, ఉపాధి పరిరక్షణ కోసం అవసరమైతే ఉద్యమాలు చేపట్టేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు తగిన కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం, యాజమాన్యం విఫలమయ్యాయని ఆమె విమర్శించారు. కార్మికుల సంక్షేమం, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల ప్రయోజనాల పరిరక్షణలో తెలంగాణ రక్షణ సమితి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కల్వకుంట్ల కవిత హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో కార్మిక సంఘాల నాయకులు, తెలంగాణ రక్షణ సమితి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వర్తక సంఘం అధ్యక్షుడిగా సురేష్‌కు ఏడాది పూర్తి



- వర్తక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు
- ప్రతి ఒక్కరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుంది: అధ్యక్షుడు సురేష్

**దశ, పినపాక:** మండలంలోని ఈ బయ్యారం క్రాస్‌రోడ్ వర్తక సంఘం అధ్యక్షుడిగా సురేష్, కమిటీ సభ్యులు బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా వర్తక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్తక సంఘ సభ్యులు, వ్యాపారులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై అధ్యక్షుడు సురేష్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ, గత ఏడాది కాలంలో వర్తక సంఘం అభివృద్ధికి సభ్యులందరూ అందించిన సహకారం మరువలేనిదని అన్నారు. వ్యాపారుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ అధికారులతో సమన్వయం, వ్యాపారుల హక్కుల పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో సభ్యుల సహకారంతోనే ముందుకు సాగగలిగామని తెలిపారు. వ్యాపారుల ఐక్యతే సంఘానికి బలమని పేర్కొన్న ఆయన, భవిష్యత్తులో కూడా సంఘాన్ని మరింత బలోపేతం చేసి వ్యాపారుల సంక్షేమానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి వ్యాపారి సమస్యను సంఘం సమస్యగానే భావించి పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం పలువురు వర్తక సంఘ సభ్యులు మాట్లాడుతూ, అధ్యక్షుడు సురేష్ నాయకత్వంలో సంఘం మరింత చురుకుగా పనిచేస్తోందని కొనియాడారు. వ్యాపారుల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు అవసరమైన ప్రతి సందర్భంలో వారికి అండగా నిలుస్తూ సంఘాన్ని ముందుకు నడిపిస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం కమిటీ సభ్యులు, వ్యాపారులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



# మణుగూరులో సింగరేణి అధికారుల రిలే నిరాహార దీక్షకు కల్వకుంట్ల కవిత సంఘీభావం

- డిప్ సైడ్‌ను వేలంపాట లేకుండా సింగరేణికే కేటాయించాలని డిమాండ్

**దశ,మణుగూరు :** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత మణుగూరు పర్యటనలో భాగంగా పీకే2 ప్రాంతంలో కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం స్థానిక జీఎం కార్యాలయం ఎదుట సింగరేణి అధికారుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, మణుగూరు ప్రాంత మనుగడ సింగరేణిపై ఆధారపడి ఉందని పేర్కొన్నారు. పీకే2 డిప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను ఎలాంటి వేలంపాట నిర్వహించకుండా నేరుగా సింగరేణి సంస్థకే కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సింగరేణి పరిరక్షణ, కార్మికుల ఉపాధి భద్రత కోసం అవసరమైన ప్రతి పోరాటానికి తమ పార్టీ మద్దతు ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. సింగరేణి బలోపేతమే మణుగూరు అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, తెలంగాణ రక్షణ సేన నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అదుపుతప్పిన బైక్ ఇద్దరికి తీవ్ర గాయాలు

**దశ, హైదరాబాద్ :** సూర్యాపేట జిల్లా మునగాల మండల పరిధిలోని జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. స్థానికుల వివరాల ప్రకారం.. కోదాడ పట్టణానికి చెందిన షేక్ అజ్మల్, సమీర్‌లు నడిగూడెంలో జరిగిన ఓ శుభకార్యానికి హాజరై తిరిగి కోదాడకు వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళ్తున్న వారి బైక్ ఒక్కసారిగా అదుపుతప్పి పల్టీలు కొట్టడంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఉన్నత వైద్యశాలకు తరలించారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా, మరొకరికి కూడా తీవ్ర గాయాలైనట్లు వైద్యులు వెల్లడించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. అధిక వేగం, వాహనంపై నియంత్రణ కోల్పోవడమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు.

# గౌరవ డాక్టరేట్ అందుకున్న డా.చందా లింగయ్య దొరకు ఘన సన్మానం



**దశ,కరకగూడెం :** ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ ఎమ్మెల్యే, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, ఆదివాసీ ఉద్యమ నాయకుడు డా. చందా లింగయ్య దొరకు అమెరికాకు చెందిన యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్‌షిప్ అండ్ ఎక్సలెన్స్ (UAU) గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసిన సందర్భంగా కరకగూడెం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన స్వగృహంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యులు డా. చందా సంతోష్ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్‌తో పాటు సర్పంచులు, ఉపసర్పంచులు, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు శాలువాతో సత్కరించి, స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు. వక్తలు మాట్లాడుతూ, డా. చందా లింగయ్య దొర గిరిజన, ఆదివాసీ, బహుజన వర్గాల హక్కుల సాధన కోసం దశాబ్దాలుగా నిరంతర పోరాటం చేస్తున్న నాయకుడిగా గుర్తింపు పొందారని అన్నారు. ఎమ్మెల్యేగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో గ్రామీణాభివృద్ధి, గిరిజన సంక్షేమం, విద్యా విస్తరణ, సామాజిక న్యాయం కోసం విశేష కృషి చేశారని కొనియాడారు. ప్రస్తుతం కూడా రాజ్యాంగ పరిరక్షణ, గిరిజన భూ హక్కులు, సాంస్కృతిక హక్కులు, సామాజిక సమానత్వం కోసం ఉద్యమిస్తున్న ఆయనకు లభించిన గౌరవ డాక్టరేట్ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. డా. చందా లింగయ్య దొర సేవలు ప్రజలకు స్ఫూర్తిదాయకమని, ఆయనను ఆదర్శంగా తీసుకుని ప్రజా సేవలో మరింత నిబద్ధతతో పనిచేస్తామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. అలాగే ఆయనకు లభించిన అంతర్జాతీయ గుర్తింపుపై హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# మండల పి ఆర్ టి యు తాత్కాలిక అధ్యక్షునిగా బి. మాన్సింగ్ నియామకం


**దశ బూర్గంపహాడ్:** పి ఆర్ టి యు జిల్లా శాఖ ఆధ్వర్యంలో బూర్గంపహాడ్ మండల అసోసియేట్ అధ్యక్షులు మాన్సింగ్ ని తాత్కాలిక మండల అధ్యక్షునిగా నియమించారు.ఈ మేరకు జిల్లా అధ్యక్షులు నర్సయ్య జారీ చేసిన నియామక పత్రాన్ని జిల్లా అసోసియేట్ అధ్యక్షులు భాస్కర్ మాన్సింగ్ కి అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా నాయకత్వం మాట్లాడుతూ, సంఘం ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, సభ్యత్వ నమోదు, సంఘ బలోపేతం, సభ్యుల సంక్షేమానికి అంకితభావంతో కృషి చేయాలని ఆకాంక్షించారు.నియామకంపై స్పందించిన బి మాన్సింగ్ మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి ఉపాధ్యాయ సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.




# కేకే కమిటీ సమావేశంలో పాల్గొన్న బూర్గంపహాడ్ ఉద్యమకారులు

**దశ, బూర్గంపాడ్:** తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం వద్ద జరిగిన తెలంగాణ ఉద్యమకారుల కేకే కమిటీ సమావేశంలో బూర్గంపహాడ్ మండలం నుంచి ఉద్యమకారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పారుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉద్యమంలో పాల్గొన్న కార్యకర్తలకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యమంలో పాల్గొన్న వారిని కేకే కమిటీ అధికారికంగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బూర్గంపహాడ్ మండలం నుంచి తోడేటి సత్యనారాయణ, మర్రి సాంబారెడ్డి, పారుపల్లి శ్రీనివాస్, మేహన్ రావు తదితరులు పాల్గొన్నారు.ఉద్యమకారుల త్యాగాలను ప్రభుత్వం గుర్తించి, వారికి న్యాయం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.





## కుదేలైన వానాకాలం సాగు!

**మొదటి పేజీ తరువాయి**

లేదు. రాష్ట్రంలో మొత్తం 1.32 కోట్ల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 55.31 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు వేశారు. వర్షాభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఆదిలాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, కరీంనగర్, జగిత్యాల, వరంగల్, హనుమకొండ, జనగామ, వికారాబాద్, మేడ్చల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్ ఉన్నాయి. కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, మహబూబాబాద్, ములుగు, మేడ్చల్, వనపర్తి, సూర్యాపేట జిల్లాల్లో పంటల సాగు 25 శాతం కూడా దాటలేదు. నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, నారాయణపేట జిల్లాల్లో 50 శాతానికి పైగా సాగు జరిగినప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. వ్యవసాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. రాబోయే రోజుల్లో విస్తారంగా వర్షాలు కురిస్తేనే వరి నాట్లు ఊపందుకునే అవకాశం ఉంది.

## ఇంటింటికీ వెళ్లాల్సిన బీఎల్‌వోలు..
# క్యాంపులకే పరిమితమా?
### అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు

**దశ, రంగారెడ్డి ప్రతినిధి:** దేశవ్యాప్తంగా కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియలో ఓటరు జాబితాల ప్రక్షాళనకు కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో వాటి అమలుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని నాగోల్ సర్కిల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ నిబంధనలకు విరుద్ధంగా సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను ప్రత్యక్షంగా కలుసుకుని వివరాలు ధృవీకరించాలి. అవసరమైన ఫారాలు అందజేసి, వాటిని తిరిగి సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఇంట్లో ఎవరూ అందుబాటులో లేకపోతే మరోసారి వెళ్లి వివరాలు సేకరించాలనే నిబంధన ఉంది. అయితే స్థానికుల కథనం ప్రకారం.. పలువురు బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లకుండా వార్డు కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు లేదా ఇతర కేంద్రాల్లో క్యాంపులు ఏర్పాటు చేసి ఓటర్లనే అక్కడికి రావాలని సూచిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఉద్యోగులకు వెళ్లే వారు, వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, అనారోగ్యంతో ఉన్నవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ అసలు ఉద్దేశం ప్రతి అర్హ ఓటరిని ప్రత్యక్షంగా గుర్తించి ఓటరు జాబితాను ఖచ్చితంగా రూపొందించడం. కానీ క్యాంపులకే పరిమితమవుతున్న విధానం వల్ల ఎన్నికల సంఘం లక్ష్యమే దెబ్బతింటోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓటర్లు క్యాంపులకు రాలేకపోతే వారి వివరాలు నమోదు కాకపోవడం, దరఖాస్తులు పెండింగ్‌లో పడిపోవడం, చివరికి అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో లేకుండా పోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

మరోవైపు, పైస్థాయి అధికారులు నిర్దేశించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేయడంపైనే దృష్టి పెట్టి, బీఎల్‌వోలు నిజంగా ఇంటింటికీ వెళ్తున్నారా లేదా అనే అంశాన్ని సమర్థంగా పర్యవేక్షించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయి తనిఖీలు లేకపోవడం వల్ల నిబంధనలను పాటించని వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో కూడా స్పష్టత లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక రాజకీయ పార్టీలు, మాజీ ప్రజాప్రతినిధులు తమ పార్టీ కార్యాలయాల్లో ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఫారాలు అందించడం, వాటిని నింపించించి బీఎల్‌వోలకు అందజేయడం వంటి పనులు చేపడుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం నిర్వహించాల్సిన బాధ్యతను రాజకీయ పార్టీలు భుజాన వేసుకోవాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎన్నికల సంఘం ప్రకటించిన విధివిధానాలు ఒకలా ఉండగా, క్షేత్రస్థాయిలో అమలు మరోలా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఓటరు జాబితా ప్రక్షాళన వంటి అత్యంత కీలక ప్రక్రియలో నిర్లక్ష్యం చోటుచేసుకుంటే భవిష్యత్తులో ఎన్నికల విశ్వసనీయతపైనా ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రతి బీఎల్‌వో తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి అర్హులైన ఓటర్ల వివరాలను నమోదు చేస్తున్నారా? లేక కేవలం క్యాంపులు నిర్వహించి లక్ష్యాలు పూర్తి చేసినట్లు నివేదికలు పంపుతున్నారా? అనే అంశంపై జిల్లా, రాష్ట్ర ఎన్నికల అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితిని వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు కచ్చితంగా అమలయ్యేలా ఉన్నతాధికారులు బాధ్యత వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## మూసీ ప్రక్షాళనకు 7,345 కోట్లకు ఆమోదం
### తొలి విడత పనులకు గ్రీన్ సిగ్నల్

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చే ప్రతిష్ఠాత్మక మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. తొలి విడత అభివృద్ధి పనుల కోసం రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధుల్లో రూ.4,500 కోట్లను ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ADB) రుణంగా సమకూర్చుకోనుండగా, మిగిలిన రూ.2,845.12 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్ రూపంలో భరించనుంది. ఈ కేటాయింపులో భూసేకరణ వ్యయాన్ని చేర్చలేదని అధికారులు స్పష్టం చేశారు. మూసీ నదిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసి హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరాల సరసన నిలిపే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. సుదీర్ఘకాలంగా ప్రతిపాదనలకే పరిమితమైన మూసీ సుందరీకరణ పనులు ఇప్పుడు క్షేత్రస్థాయిలో ప్రారంభం కానున్నాయి. భూసేకరణకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడిగా కేటాయించనుంది. తొలి విడతలో జోన్ 1ఏ, జోన్ 1బీ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు, అలాగే ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు ఉన్న పరివాహక ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయనున్నారు. నదిలోకి మురుగునీరు చేరకుండా అడ్డుకట్ట వేయడం, నదీ తీరాల వెంట పచ్చదనాన్ని పెంపొందించడం, పర్యాటక కేంద్రాల అభివృద్ధి, ఆధునిక మౌలిక వసతుల కల్పన వంటి పనులు ఇందులో భాగంగా చేపట్టనున్నారు. ప్రాజెక్టుకు అవసరమైన నిధుల సమీకరణ కోసం ప్రభుత్వం వ్యూహాత్మకంగా చర్యలు చేపట్టింది. మొత్తం అంచనా వ్యయంలో రూ.4,500 కోట్లను ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి రుణంగా పొందనుండగా, మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది. దీంతో ప్రాజెక్టు అమలుకు ఆర్థికపరమైన ఆటంకాలు ఉండవని అధికారులు భావిస్తున్నారు. పనులను వేగంగా, పారదర్శకంగా పూర్తి చేయాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును ఈపీసీ (EPC) విధానంలో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. డిజైన్, నిర్మాణం, సామగ్రి సమీకరణ బాధ్యతలను ఒకే సంస్థ నిర్వహించేలా టెండర్లు ఖరారు చేయనున్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (HMDA), పట్టణాభివృద్ధి శాఖ సంయుక్తంగా ప్రాజెక్టు అమలును పర్యవేక్షించనున్నాయి.

'కల్యాణలక్ష్మి', 'షాదీ ముబారక్' పథకాలపై
## హైకోర్టు ప్రశ్నలు..

**మొదటి పేజీ తరువాయి**

ధర్మాసనం.. శాసనసభ ఆమోదం లేకుండా కేవలం ఎనిమిది జీవోల ఆధారంగా వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని సంక్షేమ పథకాలకు కేటాయించడం రాజ్యాంగబద్ధమేనా అని ప్రశ్నించింది. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 245, 246లకు విరుద్ధమని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. పథకాలకు సంబంధించిన జీవోలను రద్దు చేయాలని కూడా కోరారు.విచారణ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపైనా హైకోర్టు వ్యాఖ్యానించింది. రాష్ట్రం అప్పుల భారం ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, కాంట్రాక్టర్ల బిల్లులు, భూసేకరణ పరిహారాలు పెండింగ్‌లో ఉండగా ఉచిత పథకాల అమలుపై ప్రభుత్వం ప్రాధాన్యత ఎందుకు ఇస్తోందని ప్రశ్నించింది. అదనపు నిధులు, మిగులు బడ్జెట్ ఉంటే సంక్షేమ పథకాల అమలులో తప్పు లేదని, అయితే క్లిష్ట ఆర్థిక పరిస్థితుల్లో నిధుల వినియోగంపై జాగ్రత్త అవసరమని పేర్కొంది. పిటిషనర్ వాదనల ప్రకారం.. 2014 నుంచి ఈ రెండు పథకాల కింద ప్రభుత్వం ఇప్పటివరకు రూ.13,484 కోట్లు ఖర్చు చేసింది. పర్యవేక్షణ లోపాల కారణంగా అనర్హులకు కూడా ప్రయోజనాలు అందాయని, కాగ్ నివేదికల ప్రకారం సుమారు రూ.90 కోట్ల మేర నిధులు దుర్వినియోగమయ్యాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్.. నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలనే సామాజిక బాధ్యతతోనే ఈ పథకాలు అమలు చేస్తున్నామని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి స్థిరంగానే ఉందని కోర్టుకు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు.. ప్రస్తుతం ఈ పథకాలపై స్టే ఇవ్వడానికి నిరాకరించింది. అయితే ప్రభుత్వం నాలుగు వారాల్లో పూర్తి వివరణ సమర్పించాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణను ఆగస్టు 5కు వాయిదా వేసింది. ఈ కేసు నేపథ్యంలో సంక్షేమ పథకాల అమలు, చట్టసభ ఆమోదం, ప్రజాధన వినియోగంపై మరోసారి చర్చ ప్రారంభమైంది.

# కోహెడలో 47 కోట్ల చేపల మార్కెట్‌కు శంకుస్థాపన




**మొదటి పేజీ తరువాయి**

నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. తెలంగాణ ప్రస్తుతం మంచినీటి చేపల ఉత్పత్తిలో దేశంలోనే అగ్రస్థానంలో ఉందని, ఈ మార్కెట్ ద్వారా రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే చేపలకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లు మరింత విస్తరించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మార్కెట్‌లో ఆధునిక శీతల గిడ్డంగులు, ఫిష్ ప్రాసెసింగ్ యూనిట్లు, ప్యాకేజింగ్ కేంద్రాలు, శిక్షణా కేంద్రం, కస్టమ్స్ సదుపాయాలు, భారీ హోల్‌సేల్ మార్కెట్ వంటి అన్ని ఆధునిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు రెండు వేల మంది వ్యాపారులు వ్యాపారం నిర్వహించడంతో పాటు ఐదు వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుందని చెప్పారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. జాతీయ మత్స్య రైతుల దినోత్సవం రోజున ప్రారంభమైన ఈ ప్రాజెక్టు మత్స్యకారుల అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. బ్లూ రివల్యూషన్ లక్ష్యాలను సాధిస్తూ మత్స్యకారులకు గిట్టుబాటు ధరలు, ఆధునిక మార్కెటింగ్ సౌకర్యాలు, ఎగుమతి అవకాశాలు కల్పించడంలో ఈ మార్కెట్ కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. విజయవాడ జాతీయ రహదారి, నాగార్జునసాగర్ రహదారి, ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో అంతర్జాతీయ ప్రమాణాలతో చేపల మార్కెట్ నిర్మించడం ద్వారా మత్స్యకారులు, ముదిరాజ్, బెస్త వర్గాలకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం 13 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించామని, అదనంగా మరో రూ.50 కోట్లు మంజూరు చేసి మొత్తం రూ.100 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలు కల్పించాలని మంత్రి వాకిటి శ్రీహరిని కోరారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ డైరెక్టర్ నిఖిల, ఫ్రూట్ మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు దూస వెంకటేష్, అదనపు డైరెక్టర్ మురళీకృష్ణ, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, మత్స్యకారులు, అధికారులు పాల్గొన్నారు.

### కోహెడలో మంత్రి శ్రీహరి కార్యక్రమంలో నిరసన..
### మత్స్యకార సంఘం నాయకుల అరెస్టు

రంగారెడ్డి జిల్లా కోహెడలో రూ.48 కోట్లతో చేపట్టనున్న హోల్‌సేల్ చేపల మార్కెట్ శంకుస్థాపన కార్యక్రమంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. కార్యక్రమానికి హాజరైన మంత్రి వాకిటి శ్రీహరికి తెలంగాణ మత్స్యకారుల, మత్స్య కార్మికుల సంఘం నాయకులు నిరసన తెలిపారు. చేప, రొయ్య పిల్లల కొనుగోలు కోసం మత్స్య సహకార సంఘాల ఖాతాల్లో ప్రభుత్వం వెంటనే నగదు జమ చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కొందరు నాయకులు వేదిక వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించడంతో అక్కడ స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అప్రమత్తమైన పోలీసులు ఆందోళనకారులను అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. మత్స్యకారుల డిమాండ్లపై ప్రభుత్వం స్పందించాలని సంఘం నాయకులు కోరారు.




## అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

**దశ, రంగారెడ్డి :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో నిర్వహించిన "శ్రీశ్రీశ్రీ అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం" లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు చీరాల రమేష్, గ్రామ సర్పంచ్ మానుపాటి శోభ, మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, ఉప సర్పంచ్ నూకం రాజు, మాజీ సింగిల్ విండో చైర్మన్ మొద్దు సికిందర్‌రెడ్డి, నోముల సర్పంచ్ బత్తుల శ్వేత, బియ్యని జ్ఞానేశ్వర్, వీఆర్ వన్ ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, దేవాలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు కావలి శ్రీనివాస్, మాసయ్య గౌడ్, గంట రవీందర్‌రెడ్డి, కొత్తపల్లి మహేందర్ గౌడ్, సాతిరి ఎల్లేష్, పున్నం రాము, జంగయ్య, జానీపాషతో పాటు పలువురు గ్రామస్తులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రైతుల కళ్లలో ఆనందమే ప్రభుత్వానికి ఆశీర్వాదం

**మొదటి పేజీ తరువాయి**

వెల్లడించారు. అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు రుణ సౌకర్యాలు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. రాష్ట్రంలోని మొక్కజొన్న రైతుల కోసం రూ.3,504 కోట్లు విడుదల చేసినట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి, రైతులు, మహిళలు, విద్యార్థులు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. తెలంగాణను దేశానికి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

## మద్యం మత్తులో ఆర్టీసీ బస్సు చోరీ..
### 21 కి.మీ. వెళ్లి ప్రమాదం




**దశ, జనగామ:** జనగామ బస్టాండ్‌లో నిలిపి ఉన్న ఆర్టీసీ అద్దె బస్సును ఓ వ్యక్తి మద్యం మత్తులో చోరీ చేసి తీసుకెళ్లిన ఘటన కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం.. పాలకుర్తికి చెందిన వెంకన్న బస్టాండ్‌లో పార్క్ చేసి ఉన్న బస్సును స్టార్ట్ చేసి సూర్యాపేట వైపు దూసుకెళ్లాడు. సుమారు 21 కిలోమీటర్లు ప్రయాణించిన అనంతరం సింగరాజుపల్లి టోల్‌గేట్ సమీపంలో బస్సు అదుపు తప్పి సిమెంట్ దిమ్మెను ఢీకొట్టడంతో ఆగిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చింది.

## ఫాతిమా ఒవైసీ కాలేజీ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో లేదన్న రాష్ట్ర ప్రభుత్వం!

**మొదటి పేజీ తరువాయి**

2016 నుంచి చెరువు విస్తీర్ణం ఎలా తగ్గిందనే అంశంపై న్యాయస్థానం లోతైన విచారణకు ఆదేశించింది. బండ్లగూడలోని సర్వే నెంబర్ 62 పరిధిలో ఉన్న సల్కం చెరువు ఆక్రమణకు గురైందని, అక్కడ ఫాతిమా ఒవైసీ కాలేజీ భవనాలను నిర్మించాని ఆరోపిస్తూ ఒక పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ చెపట్టిన హైకోర్టు, వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. జులై 9వ తేదీన జరిగిన విచారణలో, రెవెన్యూ, నీటిపారుదల, మున్సిపల్ శాఖలు కలిసి నిర్వహించిన సంయుక్త సర్వే నివేదికను ప్రభుత్వం సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం సదరు విద్యాసంస్థ చెరువు పరిధికి వెలుపలే ఉందని ప్రభుత్వం రిపోర్టు ఇచ్చింది.

## హరీశ్‌కు కాంగ్రెస్ తలుపులు తెరిచేనా?

**మొదటి పేజీ తరువాయి**

చేశారు. క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బిజీగా ఉండటంతో సమస్యల పరిష్కారం కోసం ఇద్దరు సీనియర్ నాయకులను నియమించినట్లు వెల్లడించారు. సస్పెన్షన్ ఒక్కటే పరిష్కారం కాదని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాన్ని కూలగొడతామని ప్రతిపక్షం చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. పది మంది ఎమ్మెల్యేలు తమ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నారని తెలిపారు. అలాగే, నీటి దోపిడీ జరిగిన సమయంలో ఈటల రాజేందర్ కూడా మంత్రిగా ఉన్న విషయాన్ని గుర్తుచేశారు.

## కేటీఆర్, హరీశ్‌రావుపై కవిత సంచలన ఆరోపణలు

**మొదటి పేజీ తరువాయి**

పూర్తిగా ఖండించిన ఆమె.. "నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌లోకి తిరిగి వెళ్లే ప్రసక్తే లేదు" అని స్పష్టం చేశారు. ఒక మహిళ ప్రజాబలంతో ముందుకు సాగుతుంటే ఓర్వలేక కాంగ్రెస్, బీజేపీలతో కలిసి తన ప్రజా పోరాటాలను అణచివేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. టీఆర్ఎస్ పేరును కూడా తనకు దక్కకుండా చేసేందుకు ఎన్నికల సంఘానికి వెయ్యికి పైగా ఫిర్యాదులు పంపడం బీఆర్ఎస్ భయాందోళనలకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి వ్యవహారంలో హరీశ్‌రావును ముందుకు పెడుతున్న బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదని కవిత విమర్శించారు. అలాగే కేటీఆర్ తనకు సన్నిహితంగా ఉన్న సంస్థలకు క్విడ్ ప్రో కో పద్ధతిలో అక్రమ అనుమతులు ఇచ్చారని, భారీ మొత్తంతో ఓ ఇంగ్లీష్ పత్రికను కొనుగోలు చేశారని ఆరోపించారు. డబ్బు బలంతో మీడియా, సోషల్ మీడియాను ప్రభావితం చేస్తూ తమ వార్తలు బయటకు రాకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలు సభ్యత మరిచి మహిళలపై అసభ్యకరంగా ట్రోలింగ్ చేస్తున్నారని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి దూషణలను సహించబోమని, తీవ్రంగా ప్రతిస్పందిస్తామని హెచ్చరించారు. ఫినిక్స్ సంస్థకు భారీ విలువైన భూములను కట్టబెట్టారని, అటవీ శాఖ కేసులను కూడా పక్కనబెట్టారని ఆరోపించిన కవిత.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి కిటికీలు తెరిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తలుపులే తెరిచిందని విమర్శించారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com